మిట్ట మధ్యాహ్నం రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

- ఒక చోట చోరీ, మరోచోట విఫలయత్నం

వినాయక్‌నగర్, డిసెంబర్ 29 : జిల్లాకేంద్రంలో పట్టపగలే చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు మహిళలను టార్గెట్ చేసిన దుండగులు.. వారి మెడల్లో నుంచి బంగారు గొలుసులు లాక్కెళ్లేందుకు కాలనీలో తిరుగుతూ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఓ చోట చోరీకి పాల్పడగా.. మరోచోట మహిళ ఎదురు తిరగడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండే గిరిజ ఆదివారం మధ్యాహ్నం తన కుమారుడిని ట్యూషన్ నుంచి తీసుకువచ్చేందుకు కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి నడుచుకుంటూ వెళ్తున్నది. అదే సమయంలో వెనక నుంచి ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి రోడ్డు పక్కన నిలబడ్డారు. అందులోంచి ఓ యువకుడు ఆమె వెనక నుంచి వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు లాగాడు. అప్రమత్తమైన ఆమె.. చోరీ నుంచి తప్పించుకొని గట్టిగా అరవడంతో దుండగులు పరారయ్యారు. కొద్ది సమయానికే దుండగులు బోర్గాం (పీ) గ్రామం వైపు వెళ్లి రోడ్డుపై వెళ్తున్న లక్ష్మీబాయి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును తెంచుకొని పారిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్.. సిబ్బందితో కలిసి చైన్‌స్నాచర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. హౌసింగ్ బోర్డ్ కాలనీతో పాటు ఆర్యనగర్, బోర్గా (పీ) పరిధిలోని సీసీ కెమెరాల పుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

చందూర్‌లో ముమ్మరంగా పెట్రోలింగ్

చందూర్, డిసెంబర్ 29 : మండల కేంద్రంలో రాత్రివేళ గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు పెట్రోలింగ్ చేపడుతున్నారు. శనివారం అర్ధరాత్రి ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పెట్రోలింగ్ చేపట్టారు. న్యూ ఇయర్ సందర్భంగా యువత డిసెంబర్ 31న రోడ్లపై మద్యం తాగి తిరగవద్దని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చందూర్ మైనారిటీ గురుకుల విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చందూర్, డిసెంబర్ 29 : సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చందూర్ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన నిజామాబాద్‌లోని డీఎస్ఏ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో జి. వంశీ, బి. రాంరెడ్డి, షేక్ ఇంజమామ్ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. వీరు ఈ నెల 30 నుంచి జనవరి 2వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో నిజామాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ సాయిబాబా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి / ఇందల్వాయి, డిసెంబర్ 29 : నిజామాబాద్ జిల్లాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చాలా రోజుల తర్వాత ఆదివారం రావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్ వద్ద కార్యకర్తలు, అభిమానులు గజమాలతో ఆమెను సత్కరించారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో తరలివచ్చి స్వాగతం పలికారు. బ్యాండ్ వాయిద్యాలు, నృత్యాలతోపాటు పటాకులు కాలుస్తూ ఉత్సాహంగా సాగతం పలికారు. ఎస్ఎఫ్ఎస్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వరకు బీఆర్ఎస్ శ్రేణులు ఆమె వెంట తరలివెళ్లారు.

హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా ఇందల్వాయిలోని టోల్‌ప్లాజా వద్ద గజమాలతో సత్కరించారు. డిచ్‌పల్లిలోని కేపీ దాబా ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి సాగతం పలికారు. ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి నుంచి మొదలుకొని జిల్లాకేంద్రం వరకు ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లి వద్ద స్వాగతం పలికిన వారిలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, నీరడి పద్మారావు, ఒడ్డెం నర్సయ్య, దాసరి లక్ష్మీనర్సయ్య, కుంచాల రాజు, నట్ట భోజన్న, డీకొండ శ్రీనివాస్, మొచ్చ శ్రీనివాస్, కుమ్మరి గంగాధర్, శ్రీకాంత్, యూసుఫ్, సంజయ్, అజయ్, ప్రమోద్, సతీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఇందల్వాయి వద్ద స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దాస్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబారి మోహన్, మాజీ ఎంపీపీ రమేశ్ నాయక్, మాజీ సర్పంచ్ పాశం కుమార్, అరటి రఘు, శ్రీను, సుధాకర్ తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి వద్ద గజమాలతో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న నాయకులు

కవితకు స్వాగతం పలికేందుకు తరలిన నాయకులు, కార్యకర్తలు

ధర్పల్లి/ రెంజల్/ శక్కర్‌నగర్, డిసెంబర్ 29 : ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ధర్పల్లి మండలంలోని నాయకులు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికేందుకు తరలివెళ్లారు. ధర్పల్లి నుంచి తరలిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మహిపాల్ యాదవ్, మాజీ ఎంపీపీ నల్ల సారికాహన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పీసు రాజ్‌పాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. రెంజల్ మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నిజామాబాద్‌కు తరలివెళ్లారు. ఎమ్మెల్సీ కవిత రాక నాయకులు, కార్యకర్తలత్లో ఉత్తేజాన్ని నింపిందని సంతోషం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌కు తరలిన వారిలో నాయకులు గోపాల్‌రెడ్డి, రఫీక్, రాము తదితరులు ఉన్నారు. బోధన్ పట్టణం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బోధన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, గుమ్ముల అశోక్‌రెడ్డి, నాగన్‌పల్లి మధు, రవి శంకర్‌గౌడ్, శంకర్ గౌడ్, జావిద్, నవీన్, భవానీపేట్ శ్రీనివాస్, సాగర్ ఉన్నారు.

బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికిన మహిళలు

అభిమానికి ఆత్మీయ ఆలింగనం, కరచాలనం

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 29 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆటోమోటర్ డ్రైవింగ్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎమ్మెల్సీ కవితకు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెను యూనియన్ నాయకులు కలిసి వారి సమస్యలను విన్నవించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

నందిపేట్, డిసెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఎండగట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. చౌడమ్మ కొండూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో తన భర్త అనిల్, కుటుంబీకులతో కలిసి ఆదివారం ప్రత్యేకపూజలు చేశారు. నందిపేట్ మండలానికి చేరుకున్న కవితకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీఆర్ఎస్ సోషల్‌మీడియా వారియర్స్‌తో సమావేశమయ్యారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని, జిల్లాలో ఇంకా లక్షకు పైగా రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఈ వివరాలను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, నాయకులు ఎర్రం ముత్యం, బాల గంగాధర్, మనోజ్, ప్రభాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడమ్మ కొండూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కల్వకుంట్ల కవిత, కుటుంబ సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న కాలూర్ 2003-04, మోడ్రన్ పబ్లిక్ పాఠశాల 1999-2000 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 29 : జిల్లాకేంద్రంలోని ఖలీల్‌వాడిలో ఉన్న మోడ్రన్ పబ్లిక్ పాఠశాల 1999-2000 బ్యాచ్ ఎస్సెసీ పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న 150 మంది విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని, ఆటపాటలతో రోజంతా సందడిగా గడిపారు. అనంతరం ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, సాయిబాబా, బలవంతరావు, సాయిప్రసాద్, శకుంతల, విమల, అన్నపూర్ణ, పశుపతిరావు, సురేందర్‌రావు, పీఈటీ సుబ్బారావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కాలూర్‌లో 2003- 04 బ్యాచ్ విద్యార్థులు..

సారంగపూర్, డిసెంబర్ 29 : నిజామాబాద్ మండలంలోని కాలూర్ గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్‌లో 2003-04 బ్యాచ్ విద్యార్థులు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని అదే పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 20 ఏండ్ల క్రితం చదువుకున్న అప్పటి పాఠశాల, తరగతి గదులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం భోజనాలు చేసి సందడి చేశారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

- మద్దతు తెలిపిన బీటీఏ ప్రతినిధులు

సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖలీల్‌వాడి డిసెంబర్ 29 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం - నిజామాబాద్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. జిల్లాకేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద వారు నిరసన తెలుపుతున్నారు. సమ్మెకు బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ)ప్రతినిధులు ఆదివారం మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చాలా రోజులుగా సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని జిల్లా ప్రధానకార్యదర్శి స్వామినాయక్ అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తూ పనిలో ముందుటున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సంతోష్, బియ్య సాగర్, జిల్లా నాయకులు ప్రకాశ్, సయ్యద్ యూసుఫ్, భీముడు, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

'స్ఫూర్తి భారతీయం' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

సుభాష్‌నగర్, డిసెంబర్ 29 : నగరంలోని గీతాభవనంలో ప్రముఖ పద్యకవి, గణితాచార్యుడు డాక్టర్ ఫణీంద్ర రచించిన స్ఫూర్తి భారతీయం పుస్తకావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. యశస్విని సాహితీ సమితి అధ్యక్షుడు, అష్టావధాని ఓంప్రకాశ్ బోచ్చర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అష్టావధాని డాక్టర్ గణపతి అశోకశర్మ, గౌరవ అతిథి తల్లావరుఖుల మహేశ్‌బాబు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక తొలి ప్రతిని ఫణీంద్ర.. తన మాతృమూర్తి తంగిడిగే గంగాదేవికి అందించారు. గణపతి అశోకశర్మ మాట్లాడుతూ.. వేల్పూరు గ్రామానికి చెందిన ఫణీంద్ర తమిళనాడులోని వేలూరు యూనివర్సిటీలో గణితాచార్యులుగా సేవలందించడంతోపాటు పద్యకవిత్వంలో రాణిస్తున్నారని అన్నారు. ఇంతకుముందు మూడు పద్యకావ్యాలు రచించిన ఫణీంద్ర.. ఈసారి భారతదేశంలో మహనీయులను కీర్తిస్తూ పద్యాలు రాయడం అభినందనీయమని కొనియాడారు. తల్లావరుఖుల మహేశ్‌బాబు మాట్లాడుతూ.. ఫణీంద్ర రచించే పద్యాలు విద్యార్థులందరికీ ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పుస్తకానికి ఎస్. సాయిప్రసాద్ సమీక్ష చేశారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ కాసర్ల, గంట్యాల ప్రసాద్, తుంగిడిగె శ్రీనివాస్, చింతల శ్రీనివాస్‌గుప్తా, పబ్బ మురళి, అరుంధతి, ఇప్పకాయల సుదర్శన్, మండలోజు నర్సింహస్వామి, నాగుల రాజేందర్, ఎం. అరవింద్, చంద్రశేఖర్, వినయ్‌కుమార్, చెన్న శంకర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ధర్పల్లి, డిసెంబర్ 29 : మండలకేంద్రంలో ఎస్సై జాడి రామకృష్ణ సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలతనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ముసలమ్మ చెరువుకు ఎత్తిపోతల నీరు

డిస్ట్రిబ్యూటరీలోకి వస్తున్న ఎత్తిపోతల నీళ్లు

మోర్తాడ్, డిసెంబర్ 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో పుష్కలంగా నీరు ఉన్నదని చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల ద్వారా మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల చెరువులు నింపాలని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులను శనివారం ఆదేశించడంతో వారు స్పందించారు. ఎత్తిపోతల నీటిని విడుదల చేయడంలో ముసలమ్మ చెరువుకు నీరు ఆదివారం చేరుకున్నది. అధికారులు ఎత్తిపోతల ఏజెన్సీ వారికి నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో చౌట్‌పల్లి పంప్ హౌస్ నుంచి మోర్తాడ్ ముసలమ్మ చెరువుకు నీరు విడుదల చేశారు. ముసలమ్మ చెరువు వద్ద ఉన్న పంప్‌హౌస్ మోటర్లను స్టార్ట్ చేసి బషీరాబాద్ కాడిచెరువుకు నీటిని తరలించాల్సి ఉంది. సోమవారం వరకు కాడిచెరువుకు నీరు చేరుకుంటుందని రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా రెండు మండలాల చెరువులు నింపేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు చెప్తున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

మోర్తాడ్, డిసెంబర్ 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటల సాగు కోసం నీటి విడుదల కొనసాగుతున్నది. కాకతీయ కాలువకు 5500క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 200, అలీసాగర్ లిఫ్ట్‌కు 463, గుత్పాలిఫ్ట్‌కు 270, సరస్వతీ కాలువకు 500, మిషన్ భగీరథకు 231క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 1091అడుగులు(80.5టీఎంసీలు)కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1090.20 అడుగులు(77.684టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది.

కొనసాగుతున్న రైల్వేగేటు మరమ్మతులు

రైల్వేగేటు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

నవీపేట, డిసెంబర్ 29: మండల కేంద్రంలో బాసర ప్రధాన రోడ్డుపై నాలుగు రోజుల నుంచి రైల్వే గేటు మరమ్మతు పనలు కొనసాగుతున్నాయి. ఈ రూట్లో ప్రయాణం సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులకు గురతున్నారు. హైదరాబాద్, నిజామాబాద్‌వైపు నుంచి బాసర, భైంసా వైపు వెళ్లే వాహనదారులు దూరం భారంతోపాటు సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. దారి మళ్లించడంతో కొందరు వాహనదారులు రూటు తెలియక ఇబ్బంది పడుతున్నారు. నవీపేట మండల కేంద్రంలోని బాసర రోడ్డుపై రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మిస్తే ఈ కష్టాలు తప్పుతాయని పలువురు పేర్కొంటున్నారు.

జనవరి 1 వరకు రైల్వే గేటు మూసివేత..

నవీపేట మండల కేంద్రంలో బాసర ప్రధాన రోడ్డుపై రైల్వేగేటు మరమ్మతు పనుల పూర్తి కాకపోవడంతో జనవరి 1 వరకు గేటు మూసి ఉంటుందని రైల్వే అధికారులు చెప్పారని ఎస్సై వినయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలను దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ నుంచి బాసర వైపు వెళ్లేవారు అర్సపల్లి దాటిన తర్వాత జన్నేపల్లి ఎక్స్ రోడ్డు నుంచి గుండారం, జలాల్‌పూర్, మోకన్‌పల్లి, కమలాపూర్, నవీపేట మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. బాసర నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు పొతంగల్, జన్నేపల్లి పాల్ద నుంచి నిజామాబాద్ వెళ్లాలని పేర్కొన్నారు.

బొలేరో వ్యాన్ బోల్తా

నవీపేట మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారు జామున గాజు ఫ్రేమ్‌లు తరలిస్తున్న బొలేరో వ్యాన్ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర లోని నాందేడ్ వెళ్తున్న వ్యాన్ నవీపేట రైల్వే గేటు మరమ్మతు కారణంగా దర్యాపూర్ చెరువు కట్టపై నుంచి రాంపూర్ ఎల్‌కే ఫారం మీదుగా నాందేడ్‌కు వెళ్తోంది. దర్యాపూర్ గేటు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాక చాక్యంగా తప్పించుకోగా అందులో ఉన్న అద్దాలు పగిలిపోయాయి.

హామీలు అమలుచేయకపోతే ఆందోళనలు

మాట్లాడతున్న బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్

బోధన్, డిసెంబర్ 29: బీడీ కార్మికులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే వారి ఆగ్రహానికి గురికాకతప్పదని టీయూసీఐ అనుబంధ సంస్థ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేశ్ హెచ్చరించారు. బీడీ వర్కర్స్ యూనియన్ బోధన్ పట్టణ జనరల్‌బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గద్దె ఎక్కి ఏడాది గడుస్తున్నప్పటికీ బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. బీడీ పరిశ్రమపై ఆధారపడిన ప్రతి కార్మికుడికీ రూ.4 వేల పింఛను అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, రెహానా బేగం, బిపాషా బేగం, పీడీఎస్‌యూ జిల్లా నాయకురాలు మౌనిక, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ.. ఉపాధ్యాయురాలికి గాయాలు

ఎడపల్లి, డిసెంబర్ 29: మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం ఢీ కొని ఓ ఉపాధ్యాయురాలికి గాయాలయ్యాయ. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు అనే కానిస్టేబుల్ బోధన్ నుంచి నిజామాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విధులు ముగించుకుని వెళ్తున్న ఉపాధ్యాయురాలు స్రవంతిని మండల కేంద్రంలో బైక్ ఢీకొట్టింది. ఉపాధ్యాయురాలికి గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను బోధన్ దవాఖానకు తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పెరిగిన నేరాల సంఖ్య

- జిల్లాలో పెరిగిన కిడ్నాప్, లైంగికదాడులు, దోపిడీ, చోరీల సంఖ్య
- గతేడాది కన్నా ఎక్కువ క్రైం రేట్ నమోదు
- ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ వెల్లడి

వినాయక్‌నగర్, డిసెంబర్ 29 : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 2024వ సంవత్సరంలో నేరాల సంఖ్య పెరిగింది. దోపిడీ, చోరీలు, కిడ్నాప్‌లు, లైంగికదాడులతోపాటు హత్యల సంఖ్య కూడా పెరిగింది. 2024లో జిల్లావ్యాప్తంగా నమోదైన నేరాల సంఖ్య, వాటి వివరాలను ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది మొత్తం 8635 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది వాటి సంఖ్య 8745కి పెరిగింది. ఏడాది కాలం పాటు కమిషనరేట్ పరిధిలో జరిగిన నేరాల వివరాలను పోలీస్ అధికారులు ప్రతి ఏడాది మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తారు. కానీ ఈ ఏడాది ఎలాంటి విలేకరుల సమావేశం లేకుండానే కేవలం ప్రకటన ద్వారా వెల్లడించడం గమనార్హం.

ఈ ఏడాది జరిగిన నేరాల వివరాలు..

నేరం	2023లో	2024లో
హత్యలు	3	6
లైంగికదాడులు	74	77
కిడ్నాప్‌లు	24	57
చోరీలు	294	350

న్యూఇయర్ వేడుకలకు ఎక్సైజ్ శాఖ ఆంక్షలు

- అనుమతి లేని ప్రాంతాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు
- పర్మిషన్ లేని హోటళ్లలో మద్యం వినియోగించరాదు
- డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి

వినాయక్‌నగర్, డిసెంబర్ 29 : న్యూఇయర్ వేడుకల్లో భాగంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి పలు ఆంక్షలు విధించారని సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో యువత డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లవద్దని, అనుమతి లేని ప్రదేశాలు, బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనుమతి లేని హోటళ్లు, దాబాల్లో మద్యం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల నిర్వాహకులు ఈవెంట్ల నిర్వహణకు అనుమతి తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నిఘా కోసం 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

ఇసుక రవాణ చేస్తున్న టిప్పర్

నవీపేట, డిసెంబర్ 29: రెంజల్ మండలం నుంచి మండల కేంద్రానికి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. రెవెన్యూ, పోలీస్ అధికారులను మచ్చిక చేసుకొని అక్రమార్కులు ఇసుక తరలిస్తున్నారని స్థానికులు అంటున్నారు. సిద్దాపూర్ క్వారీలో నుంచి ఒకే వే బిల్‌పై ఐదు టిప్పర్లు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. కొంత మంది అక్రమార్కులు రెంజల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక డంపులు చేసుకొని రాత్రి వేళలో ఇరత ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నవీపేట మండలానికి చెందిన రెవెన్యూ, పోలీస్ అధికారులను మచ్చిక చేసుకొని ఇసుక వ్యాపారులు ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.

NT-338986-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ క్లాసిఫైడ్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లే